

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025 5 పేజీలు



### విపత్తులు సంభవించిన సమయాల్లో

# ప్రజలకు అండగా నిలవాలి

## -'ఆపద మిత్ర' శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

అనుకోని రీతిలో విపత్తులు సంభవించిన సమయాల్లో తక్షణమే స్పందిస్తూ ప్రజలకు అండగా నిలువాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కమ్యూనిటీ వాలంటీర్లకు సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ సూచనల మేరకు కలెక్టరేట్ లోని విపత్తుల విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఎంపిక చేసిన సుమారు 300 మంది కమ్యూనిటీ వాలంటీర్లకు ఇరవై రోజుల పాటు 'ఆపద మిత్ర' కార్యక్రమం పేరిట శిక్షణను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం లోని న్యాక్ భవనంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిపరంగా కానీ, మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవించిన సందర్భాల్లో స్థానికంగా ఉండే సామాజిక కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలనే ముఖ్య ఉద్దేశ్యంతో




వారికి ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు ప్రతీ చోట అందుబాటులో ఉండే అవకాశాలు లేనందున కమ్యూనిటీ వాలంటీర్లకు శిక్షణ అందించే కార్యక్రమానికి 2016 లో శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రయోగాత్మక దశగా దేశంలోని 30 జిల్లాలలో మొదటగా ఈ తరహా శిక్షణ అందించారని, దీనివల్ల మంచి ఫలితాలు రావడంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలలో వాలంటీర్లను ఎంపిక చేసి ఆపద మిత్ర పేరిట శిక్షణ అందిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి తదితర అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు అగ్నిమాపక(మిగతా 2లో)

### వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు

# మోడల్ కోడ్ పాటించాలి

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి**

ఏం.ఎల్.సి. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మాడల్ కోడ్ పాటించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గం ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికలకు నేడు అనగా ఫిబ్రవరి 3 వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ఈ నెల 10 లోగా నామినేషన్ దాఖలు చేయవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 27 న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మార్చి 3 న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో (మిగతా 2లో)



### స్వదేశీ జాగరణ మంచ్ పోస్టర్లను విడుదల చేసిన

# కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కరీంనగర్‌లో జరగబోయే స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11 నుండి 16 వరకు జరగబోయే స్వదేశీ మేళా పోస్టర్లను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ (మిగతా 2లో)



# మైసమ్మ గుడి పునర్నిర్మాణం

## - ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

**సూర్య కామారెడ్డి టౌన్**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో సోమవారం మైసమ్మ గుడి పునర్నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు, పోసానిపేట గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి(మిగతా 2లో)



# బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ గా రాజేందర్ రెడ్డి సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు వరంగల్ అడిషనల్ కమిషనర్ గా పనిచేసిన రాజేందర్ రెడ్డి పదోన్నతి పై ఇక్కడికి వచ్చారు బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు డిసెంబర్ 19న మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన స్పందన ఈనెల 10 రోజులపాటు ఇక్కడ విధులు నిర్వర్తించి రంగారెడ్డి మెప్మా పీడిగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణాన్ని (మిగతా 2లో)



# ప్రజావాణికి 141 ఫిర్యాదులు

**సూర్య ఇందూర్**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 141 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, (మిగతా 2లో)



# బిజెపి పాలిత ప్రాంతాల వైపే మొగ్గు

## - తెలంగాణకు అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్ - కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**సూర్య ఆర్మూర్ ప్రతినిధి**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం చేసిందని, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించారు. టి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మర గంగారెడ్డి లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు రూపాయి కూడా కేటాయించక పోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు గెలిచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ కేంద్ర బడ్జెట్ లో మొండి చేయి చూపిందన్నారు. జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ గతంలో జిల్లాకు ఒక నవోదయ విద్యాలయం, మిలటరీ సైనిక్ స్కూల్ తీసుకువస్తానని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్మూర్ నుండి అదిలాబాద్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు కోసం బడ్జెట్లో పెట్టిన పాపాన లేకుండా పోయిందని ఆరోపించారు. అదేవిధంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకువచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. ఎక్కడైతే బిజెపి ప్రభుత్వాలు ఉన్నాయో అక్కడ అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. గత 11 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చూపిన మొండి వైఖరికి నిరసనగా బిజెపి నాయకులను రానున్న రోజుల్లో తిరుగనిచ్చే ప్రసక్తి ఉండదన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికులుగా పనిచేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయి రెడ్డి, ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, మంద మహిపాల్, రవి ప్రకాష్, భూమేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, కాందేష్ శ్రీనివాస్, వెంకట్ రామ్ రెడ్డి, షేక్ మున్నా, లింగాగౌడ్, భోజరెడ్డి, ఇంతియాజ్, అతిక్, ఫయాజ్, రెహమాన్, ప్రశాంత్, నిఖిల్, వినోద్, విజయ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్ర సాఫ్ట్ బాల్ మహిళల ఛాంపియన్షిప్

## - ప్రథమ స్థానం నిజామాబాద్

**సూర్య ఇందూరు**




ఈ నెల 01 నుండి 02 వరకు మినీ స్టేడియం మరియు జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడా మైదానంలో జరిగిన 11వ సీనియర్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ మహిళల ఛాంపియన్షిప్ ఫైనల్ మ్యాచ్ ముఖ్య అతిథులుగా ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి గారు విచ్చేసి గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు విచ్చేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలలో రాణించాలి, గెలుపొందిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో వచ్చే సంవత్సరం కూడా విజయం సాధించాలని ఓటమి చెందిన క్రీడాకారులు వచ్చే సంవత్సరం విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు, మహిళలు అన్ని రంగాల్లో పట్టు సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె శోభన్ బాబు, జక్రాన్ పల్లి మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుప్పాల లక్ష్మీ నరసయ్య, రాష్ట్ర ఒలంపిక్ అబ్జర్వర్ లింగన్న, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, ఆర్మూర్ రోటరీ అధ్యక్షులు రాజేష్, చార్టెడ్ అకౌంట్ రాజశేఖర్, టిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గంట అశోక్, పిఆర్టియు జక్రాన్ పల్లి మండల అధ్యక్షులు గోపి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు కోపూరి సంగీతరావు, జైడి రాజ్ కుమార్, మర్కంటి సుజాత, బీసీ సంఘ నాయకులు వేంపల్లి శేఖర్, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ విట్టల్, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ వి మౌనిక, హెచ్ అనికేత్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ క్యాచర్ గూగుల్ మమత నిజాంబాద్ జిల్లా క్రీడాకారిని ప్రత్యేక బహుమతిని అందుకుంది. ఫైనల్ మ్యాచ్లో నిజామాబాద్ జిల్లా జట్టు సిద్దిపేట జట్టుపై 6-0 పరుగుల తేడాతో విజయం సాధించి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానం సిద్దిపేట జట్టు నిలిచింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్లో హైదరాబాద్ జట్టు అదిలాబాద్ జట్టుపై 10-01 పరుగుల తేడాతో గెలుపొంది హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది.

# ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**సూర్య బాల్కొండ**



బాల్కొండ మండల కేంద్రంలోని సనాతన చరిత్ర గల సయ్యద్ షా ముల్తానీ బాదుషా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల ఐదు నుండి రెండు రోజుల పాటు జరిగే సందల్, ఉర్సు, ఊరేగింపు లకు ఎప్పటిలాగే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, దానికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త సయ్యద్ అర్షద్ పాష తెలి పారు. 500 సంవత్సరాల నుండి ఈ ప్రసిద్ధి చెందిన దర్గా షరీఫ్ ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిందని స్థానిక నాయకులు సయ్యద్ మజారుద్దీన్, యూనుస్, సయ్యద్ ఫయాజ్ అలీ తెలిపారు.

# సాలూర మండల ఎంపీడీఓగా శ్రీనివాస్

**సూర్య బోధన్**



నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలో నూతనంగా ఏర్పడిన సాలూర మండలం నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా హెచ్.శ్రీనివాస్‌ను అధికారులు నియమించారు. రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హెచ్. శ్రీనివాస్‌ను సాలూర మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సోమవారం నుండి సాలూర మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాలుర మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# సేవలాల్, జగదాంబ మాత మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**సూర్య, లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని రాంపల్లి తండాలో సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ శ్రీ జగదాంబ మాత, సేవలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పుచ్చుకున్నారు. అనంతరం లింగంపేట్ మండల కేంద్రంలోని కేకేవై రోడ్ ప్రక్కనున్న న్యూ సొసైటీ కాంప్లెక్స్ ముందర వాహబ్ కాంప్లెక్స్‌లో అమ్మ ఫ్లెక్సీ ప్రింటర్ షాపును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారగౌడ్, ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, టిపిసిసి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫియొద్దిన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, యూత్ అధ్యక్షుడు సుప్పాల రాజు, కాంగ్రెస్ నాయకులు మొహిద్, వంజరి ఎల్లమయ్య, అశోక్, కార్యకర్తలు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# సేవలాల్ గుడి అభివృద్ధికి 40 వేల విరాళం

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని రాంపల్లి స్కూల్ తాండ సేవలాల్, జగదాంబ మాత గుడి అభివృద్ధి కొరకు 40 వేల రూపాయల విరాళాన్ని జాగృతి నాయకుడు ఎదురుగట్ల సంపద గౌడ్ గిరిజన నాయకులకు అందజేశారు. సోమవారం రాంపల్లి తండాలో సేవాలాల్, జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకొని ఆయన మందిరాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట గిరిజ నాయకులు తదితరులున్నారు.

# ఎన్నికల సామాగ్రి పంపిణీకి రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

**సూర్య కామారెడ్డి**



శాసన మండలి నియోజక వర్గ ఎన్నికల నిర్వహణకు రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కోసం ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలోని గదులను కలెక్టర్ పరిశీలించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గాల ఎన్నికల సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలోని గదులను అదనపు కలెక్టర్ తో కలిసి సందర్శించారు. శాసన మండలి సభ్యుల ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామాగ్రి పంపిణీకి రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల నియమావళి మేరకు గదులను ఏర్పాటు చేయాలని, సి.సి.కెమెరాలు, పోలీసు బందోబస్తు వంటివి ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ ప్రభాకర్, తహసీల్దార్ జనార్ధన్, రోడ్లు భవనాలు శాఖ ఈఈ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య దినపత్రిక డైరీ ఆవిష్కరించిన ఎస్సై

**సూర్య రాజంపేట**



రాజంపేట మండలంలో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై పుష్పరాజ్ చేతుల మీదుగా సూర్య దినపత్రిక డైరీ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ, ప్రింట్ మీడియా సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా ప్రజలకు నిజమైన సమాచారం అందించడంలో సూర్య దినపత్రిక విశేషంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. విలేకరులు సమాజ సమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు వారధిగా వ్యవహరిస్తున్నారని ప్రశంసించారు.

# పరిశుభ్రత పాటించాలి

**సూర్య, భీమ్‌గల్**



భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో హొటల్స్, బేకరీల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గోపు అన్నారు. సోమవారం పట్టణంలో పలు బేకరీలు, హొటల్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులు పరిశుభ్రత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడోద్దని, గడువు తీరిన, కుళ్ళిపోయిన ఆహార పదార్థాలు తనిఖీల్లో బయటపడితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన కొరకు మున్సిపల్ ఆదేశాలను పట్టించాలన్నారు.

# విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**సూర్య- బిక్కనూర్**



విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ఇన్చార్జి వైద్యురాలు దివ్య వివరించారు. సోమవారం మండలంలోని సిద్ధిరామేశ్వర్ నగర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులకు ఆరోగ్య విషయంలో సందేహాలు ఉంటే స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సతీష్, ఏఎన్ఎం యాదమ్మ, ప్రిన్సిపల్ రఘు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్ ప్రతినిధి**



జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, సీ.సీ టీ.వీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించు కుని అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్ రావు ఉన్నారు.

# కామారెడ్డి రక్తదాతల సమూహానికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు...

## - దేశంలోనే అత్యధిక యూనిట్లను తలసేమియా చిన్నారులకు అందజేసిన సంస్థగా గుర్తింపు..

## - 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించి తెలంగాణకే గర్వకారణం..

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి రక్తదాతల సమూహం కామారెడ్డి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) లకు భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకోవడం జరిగింది. ఈ సంవత్సర కాలంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 22 మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించి 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకుగాను ఈ ఘనతను సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి సమూహ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ బాలు,డాక్టర్ వేద ప్రకాష్ లు



మాట్లాడుతూ తల సేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. దేశంలోనే సంవత్సరకాలంలో 2306 యూనిట్ల రక్తాన్ని అత్యధిక యూనిట్లను తలసేమియా చిన్నారుల కోసం ఒక సంవత్సర కాలంలో అందజేసిన ఘనతను సాధించిన మొట్టమొదటి సంస్థగా కామారెడ్డి రక్తదాతల సమూహం మరియు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కు దక్కిందని, ఇప్పటివరకు 4 యూనిట్లకు పైగా రక్తాన్ని చిన్నారుల కోసం అందజేయడం జరిగిందని భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి చిన్నారుల ప్రాణాలను కాపాడుతామన్నారు. ఈ విజయానికి సహకరించిన రక్తదాతలకు,కళాశాలల యాజమాన్యాలకు,స్వచ్ఛంద సంస్థలకు,మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లక్ష డప్పుల కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరణ

**సూర్య- బిక్కనూర్**



ఎస్సీ వర్గీకరణ, మాదిగల సమస్య లపై ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడవ తేదీన నిర్వహించే సభకు మండలం నుండి పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ సోదరి సోదరీమణులు తరలి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్టిగిని శంకర్,లక్ష్మణ్,ప్రదీప్,స్వామి,కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని కాచాపూర్ గ్రామంలో మేడ్చల్ జిల్లా నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని వైద్య సిబ్బంది చెప్పారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీలు బైండ్ల సుదర్శన్, గాల్ రెడ్డి లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్తుల కోసం గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వినియోగించుకున్నారని వారు చెప్పారు. కాగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఆపరేషన్ నిమిత్తం బుధవారం ఉచితంగా ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు.

## వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు..

**సూర్య ఆర్మూర్.**

వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని ఆర్మూర్ ప్రాంతంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ శాస్త్రీయ బద్ధంగా సరస్వతి దేవికి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంత పంచమి అనేది వసంత రుతువు ప్రారంభాన్ని సూచించే ప్రముఖ పండుగ అన్నారు. వసంత పంచమి విద్య సాంప్రదాయాలు సాంస్కృతి యొక్క పరిపూర్ణ సంగమం అన్నారు. అదేవిధంగా పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ రామ్ మందిర్ పాఠశాలలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి దేవి ఆలయంలో పండిత్ ప్రేమ్ తులసి దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



## అనకాపల్లి బెల్లాన్ని పరిశీలించిన ఏఎంసీ సభ్యులు



**సూర్య- బిక్కనూర్**

జిల్లాలో చెరుకు రైతుల కోసం బెల్లం వండుకునేందుకు రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు చెప్పారు. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి బెల్లం తయారీని మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో గతంలో బెల్లం వండకాలు ఉండేవని, గత ప్రభుత్వాలు బెల్లం తయారీని అడ్డుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బెల్లం తయారీకి అనుకూలంగా ఉండడంతో అనకాపల్లిలో బెల్లం తయారీని పరిశీలించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ చెప్పారు. అనకాపల్లి బెల్లం తయారీ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన చెప్పారు. చెరుకు రైతులకు బెల్లం వండుకోవడంతో అధిక లాభాలు వచ్చి మళ్లీ పాత రోజులు వస్తాయని, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో నియోజకవర్గంలో ఉన్న చెరుకు రైతులు త్వరలో శుభవార్త వింటారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, కార్యదర్శి నరసింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు

## ఎమ్మెల్సీ అభ్యర్థిగెలుపు కు కృషి చేయండ

**- తపస్ రాష్ట్రఅధ్యక్షులుహనుమంతరావు**

**సూర్య కామారెడ్డి ప్రతినిధి**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (%ూఖూ%) రాష్ట్ర శాఖ అధ్యక్షులు హనుమంతరావు కామారెడ్డి జిల్లాలో పర్యటించారు.కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు హన్మంతురావ్ సోమవారం రోజున సమావేశంలో పాల్గొని ప్రసంగించడం సందర్భంగాజరిగింది. ఈ సందర్భంగారాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు . కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు . గతం లో ఉన్న %మీాజ% లు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల గురించి ఏమీ మాట్లాడని వారు ఇప్పుడు అవకాశం ఇవ్వమనడం , శోచనీయం,అందరూ జాతీయ భావజాలాన్ని కలిగిన %ూఖూ% బలపర్చిన అభ్యర్థి మల్కా కొమురయ్య గారికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించ గలరనిఅయన కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పుల్గం రాఘవ రెడ్డి , తపస్ రాష్ట్రబాధ్యులు మేక రామచేంద్రం , జిల్లా బాధ్యులు , లక్ష్మీ పతి,ఆంజనేయులు,సంతోష్, శ్యామ్ గౌడ్ , కృష్ణ, మధుసూధన్, శ్రీనివాస శర్మ ,మారుతి, తదితరులు పాల్గొన్నారు.




## కానిస్టేబుల్ ను సన్మానించిన ఎస్సై

**సూర్య మోర్తాడ్**



మోర్తాడ్ పోలీస్ స్టేషన్ లో కానిస్టే బుల్ గా విధులు నిర్వహిస్తున్న గణేష్ రెజ్లింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినందుకు ఎస్సై విక్రం సోమవారం స్టేషన్ లో శాలువాతో సన్మానించారు. వివరాల్లోకి వెళితే కరీంనగర్ పట్టణంలో జనవరి 28న ప్రారంభమైన రెజ్లింగ్ పోటీలు ఫిబ్రవరి 1న ముగిశాయి. హోరా హోరీగా సాగిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని కానిస్టేబుల్ గణేష్ బ్రాంజ్ మెడల్ సాధించడంపై ఇటు పోలీస్ శాఖతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం ఎస్సై విక్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పట్టణంలో జరిగిన థర్డ్ తెలంగాణ స్టేట్ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ రెజ్లింగ్ విభాగంలో కానిస్టేబుల్ గణేష్ మెడల్ సాధించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఉద్యోగరీత్యా ఎన్ని ఇబ్బందులు ఉన్నా క్రీడలపై దృష్టి పెట్టి తన ప్రతిభను కనబరిచి మెడల్ సాధించడం పై ఎస్సై మనస్ఫూర్తిగా అభినందించారు. గణేష్ సాధించిన మెడల్ చూసి తోటి ఉద్యోగులు సైతం స్ఫూర్తి పొందే అవకాశం ఉందన్నారు. క్రీడల పై పట్టుదల పెరుగుతుందన్నారు. కానిస్టేబుల్ గణేష్ ఇలాంటి మెడల్స్ భవిష్యత్తులో మరిన్ని సాధించి, మంచి రెజ్లర్ గా ఒక క్రీడాకారునిగా ఎదగాలని, మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్సై స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న తోటి కానిస్టేబుల్స్ సైతం గణేష్ మెడల్ సాధించడం పై అభినందిస్తూ, పూలగుచ్చంతో సత్కరించి, శాలువాతో సన్మానించి, వారు సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వసంత్, గురునాథ్, ప్రుద్వి, రమ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆవు,అవని, రక్షణ - అందరి బాధ్యత

**సూర్య - మోపాల్**

గోమాతకు భారతీయ సంస్కృతి లో విశేష స్థానం వుందని. ఆవు, అవని,వాటి రక్షణ కు అందరు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. విశ్వ ప్రేమ మట చారిటబుల్ ట్రస్ట్, ఇందూర్ గోసేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నాగారం ఓం గురుకులంలో ఆవు రక్షణ - అవని రక్షణ అంశం పై సదస్సు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన గో సదనాన్ని ప్రారంభిచారు. దేవాయజ్ఞం జరిపారు. మఠం వ్యవస్థాపకుడు పరబ్రమ్మ అధ్యక్షత వహించి ప్రసంగించారు. కామారెడ్డి కి చెందిన వేదంపండితులు గంగవరం నారాయణ శర్మ, హైదరాబాదుకు చెందిన చరిత్ర పరి సోదకుడు మదన్ గుప్త వక్తలుగా హాజరై గోమాత ప్రాముఖ్యతను వివరించారు ఈ కార్యక్రమంలో రమేశ్ గుప్తా,అంజయ్య, శ్రీనివాస చారి, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు తమ పేర్లను సిఎస్ఎస్ సెంటర్లో నమోదు చేసుకోవాలి

**- మత్స్యశాఖ అధికారి**

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్నటువంటి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు అధ్యక్షులు కార్యదర్శులు ఉపాధ్యక్షులు ఇతర సభ్యులు చేపల వేట చేస్తున్న ప్రతి ఒక్క సభ్యులు ప్రధానమంత్రి మచ్చకిసాన్ సమృద్ధి సహయోజన ద్వారా మీ సమీప మండల కామన్ సర్వీస్ సెంటర్ లోతమ్మ పేరును నమోదు చేసుకోవాలని మత్స్య శాఖ అధికారి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాల సభ్యులు కార్యదర్శులు అధ్యక్షులు కార్యదర్శులు ఉపాధ్యక్షులు నిజాంసాగర్ ఎక్కువ మానేరు జలషాలలో లైసెన్సులు తీసుకొని చాపల వేట చేస్తున్న ప్రతి ఒక్క సభ్యులు పూర్తిగా ఆధారపడిన మత్స్యకారులందరికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు ఇంకేమైనా సమాచారం అవసరం అనుకుంటే సంబంధిత శాఖ అధికారికి సంప్రదించాలని ఆయన సూచించారు. మీ పేర్లు నమోదు చేసుకునే సమయంలో వెంట ప్రతిగా ఆధార్ కార్డు తో పాటు సంఘానికి సంబంధించిన కార్డుతో సెంటర్ కి వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు అవసరమైతే మత్స్యశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

